క్లుప్తంగా

ప్రతి రోజూ వ్యాయామం చేయాలి

బోట్‌క్లబ్: క్రమంతప్పకుండా ప్రతి రోజూ వ్యాయామం చేయడం ద్వారా సుగర్ వ్యాధి నుంచి కాపాడుకోవచ్చని ప్రముఖ ఎండోక్రైనాలజిస్ట్ భీమాల దుర్గాప్రసాద్ అన్నారు. ప్రపంచ డయాబెటిస్ దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక డైట్ ఆసుపత్రిలో ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రస్తుత ఆహార అలవాట్ల కారణంగా సుగర్ వ్యాధి పెరుగుతోందన్నారు. ఆహారంలో జంక్‌ఫుడ్ లేకుండా చూసుకోవాలన్నారు. అసోసియేషన్ మాజీ అధ్యక్షులు అద్దాల సత్యనారాయణ మాట్లాడుతూ, జీవనశైలిలో నడక, ప్రాణాయమం, క్రీడలు, మంచి పోషికాహారం ఉండేలా చూసుకోవాలన్నారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్షులు నాగేంద్ర ఆధ్వర్యంలో 120 మందికి రక్త పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు వీవీరావు, సువర్ణ, రఘురామ్, సిరాజ్ పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్య శిబిరం



చిన్నారులకు దంత పరీక్షలు చేస్తున్న అద్దాల

బోట్‌క్లబ్: బాలల దినోత్సవం సందర్భంగా స్థానిక ఆర్ఆర్ నగర్‌లోని వాగ్దేవి నృత్య నికేతన్‌లో గురువారం ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా దంత వైద్యులు అద్దాల సత్యనారాయణ మాట్లాడుతూ, ప్రతి రోజు ఉదయం, రాత్రి దంతాలు శుభ్రం చేసుకోవాలన్నారు. దంత వ్యాధులు, నోటి దుర్వాసన నివారించడానికి నోటి పరిశుభ్రతను రోజు నిర్వహించడం ముఖ్యమన్నారు. ఆరు నెలలు ఒకసారి దంత వైద్యున్ని సంప్రదించి, దంత పరీక్షలు చేయించుకోవాలన్నారు. మానసికంగా, శారీరకంగా అలసిపోయేలా చేసే పాఠశాలలకు పిల్లలను పంపవద్దన్నారు. ఈ కార్యక్రమంలో నాట్యాచార్యులు కల్యాణి, సంస్థ కార్యదర్శి టి తేజేశ్వరరావు పాల్గొన్నారు.

పీఆర్ స్కూల్‌లో టీటీ రూమ్ ఏర్పాటు



నూతన టీటీ రూమ్‌లో ఆడుతున్న క్రీడాకారులు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): హరిష్ స్పోర్ట్స్ అధినేత టి.హరిష్ సౌజన్యంతో స్థానిక పీఆర్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో టేబుల్ టెన్నిస్ రూమ్ ఏర్పాటు చేసినట్టు పాఠశాల హెచ్ఎం ప్రేమజ్యోతి తెలిపారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో నూతన టీటీ రూమ్‌ను హరిష్ ప్రారంభించారని గురువారం ఆమె తెలిపారు. ఆయనను దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో అర్బన్ ఎంఈఓ-2 రవి, పీడీ పట్టాభి, కళాశాల పీడీ వర్మ, మాచరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆధునిక జీవన శైలితోనే మధుమేహం

కాకినాడ రూరల్: తగిన శారీరక వ్యాయామం లేకపోవడం, ఆధునిక జీవనశైలి, మానసిక ఒత్తిడి వలన మధుమేహం వస్తుందని డాక్టర్ అద్దాల సత్యనారాయణ అన్నారు. స్థానిక రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మధుమేహ నియంత్రణ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ, ఆహార నియమాలు పాటించడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలని చెప్పారు.

బాలరిష్టాలు దాటి..

చంద్ర మండలాన్ని దాటిన మహోన్నత ఘనత మన దేశానిది. భవిష్యత్తులో బుల్లెట్ రైళ్లనూ పట్టాలెక్కించే సామర్థ్యం మనకుంది. ఇలాంటి ఘనతలున్న.. ప్రపంచ స్థాయి ఖ్యాతిని చాటుతున్న ఈ నేలపై.. బాల్యం ఇంకా వీధివీధినా బిచ్చమెత్తుకుంటూనే ఉంది. నేటి బాలలే రేపటి పౌరులన్న నినాదం పుట్టిన మన స్వాతంత్ర్య దేశంలో.. బాలల భవితవ్యం 'కొందరి' అరాచక స్వార్థానికి బలవుతూనే ఉంది. భవిష్యత్తులో డాక్టర్లు, ఇంజినీర్ల లాంటి గొప్ప హోదాలో ఉండాల్సిన రేపటి పౌరుల బాల్యాన్ని చిదిమేస్తుంటే.. వారిని కాపాడేందుకు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ నడుం బిగించింది.

- భిక్షాటన చేస్తున్న పిల్లల్ని గుర్తించేందుకు ప్రణాళిక
- స్త్రీ, శిశు సంక్షేమ శాఖలోని బాలల పరిరక్షణ విభాగం నిర్వహణ
- 21 మంది వీధి బాలలకు ప్రత్యేక స్కూలు ఏర్పాటు
- సత్ఫలితాలిస్తున్న అధికారుల కృషి

కాకినాడ క్రైం: తమ వయసున్న పిల్లలు పుస్తకాలతో బడికి వెళుతుంటే, ఇంకెందరో చిన్నారులు జోలె పట్టి భిక్షాటన చేస్తున్నారు. తల్లిదండ్రులు కొందరు తమ పిల్లలతో భిక్షాటన చేయిస్తున్నారు. ఈ స్థితి ఆ చిన్నారుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. ఈ నేపథ్యంలో మిషన్ వాత్సల్య పరిధిలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో ఇలాంటి పిల్లల్ని గుర్తించి, వారి భవిష్యత్తును తీర్చిదిద్దే గురుతర బాధ్యతకు శ్రీకారం చుట్టింది జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికార యంత్రాంగం. ఇందుకు నిష్ణాతులతో కూడిన ఓ ప్రత్యేక విభాగం పనిచేస్తోంది.

బంగారుమయం చేసేందుకే..

బాలల్ని భిక్షాటన, బాల కార్మిక వ్యవస్థల నుంచి దూరం చేసి, బడిబాట పట్టించడం ద్వారా వారి భవితను బంగారుమయం చేసేలా ఈ బృహత్తర కార్యక్రమానికి ఈ నెల ఒకటిన శ్రీకారం చుట్టారు. ఇది వంద రోజుల పాటు కొనసాగనుంది. ఇందులో భాగంగా హాట్‌స్పాట్లలో తనిఖీలు చేపడతారు. రెస్క్యూ నిర్వహించి, బిచ్చమెత్తే వీధి బాలలను గుర్తిస్తారు. వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. భిక్షాటన చేయించడం, బిచ్చగాళ్లలా మార్చడం నేరమని, చట్టపరమైన చర్యలను వివరించి కౌన్సెలింగ్ ఇస్తారు. గుర్తించిన పిల్లలను స్థానిక సచివాలయాల్లో నమోదు చేసి, అంగన్‌వాడీ కేంద్రాలకు అప్పగిస్తారు. వారికి నాణ్యమైన విద్య, ఆహారం, వసతి అందేలా చర్యలు చేపడతారు.

హాట్ స్పాట్లు ఇవే..

బాలలు భిక్షాటన చేస్తున్న పలు ప్రాంతాలను(హాట్ స్పాట్లు) అధికారులు ఇప్పటికే గుర్తించారు. వీటిలో కాకినాడ అచ్చంపేట జంక్షన్, సామర్లకోటలోని భీమేశ్వరస్వామి గుడి ప్రాంతం ప్రధానమైనవి కాగా, సీజన్‌ని అనుసరించి గుళ్లు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, షాపింగ్ మాళ్ల వంటి రద్దీ ప్రాంతాలను హాట్ స్పాట్లుగా గుర్తించారు.



భిక్షాటన చేస్తున్న బాలలు, వారి తల్లులకు కౌన్సెలింగ్ ఇస్తున్న పీవో విజయ, బృంద సభ్యులు

ప్రత్యేక బృందం

ఈ బృహత్తర కార్యక్రమానికి పది మందితో ఓ ప్రత్యేక బృందం పనిచేస్తోంది. ప్రాజెక్ట్ డైరెక్టర్ కొండా ప్రవీణ ఆధ్వర్యంలో, డీసీపీవోగా వెంకట్ పర్యవేక్షణలో ఈ బృందం పనిచేస్తుంది. ముగ్గురు పీవోలు ఉంటారు. వీరిలో పీవో ఎన్ఐసీ నాన్ ఇన్‌స్టిట్యూషనల్ కేర్ జాగరపు విజయ, పీవో ఇన్‌స్టిట్యూషనల్ కేర్ శ్రీనివాస్, ఎల్‌సీపీవో లీగల్ కం ప్రొహిబిషన్ ఆఫీసర్ సుధాకర్ కీలక సభ్యులుగా ఉన్నారు. ఈ కార్యక్రమమంతా ఎన్ఐసీఎన్ఐ పీవో విజయ ఆధ్వర్యంలో కొనసాగుతుంది. ఆమె పరిధిలో కౌన్సిలర్, ఇద్దరు సోషల్ వర్కర్లు, ఇద్దరు అవుట్‌రీచ్ వర్కర్లు పనిచేస్తారు. వీరుకాక విద్యా శాఖ, పోలీస్, కార్మిక శాఖలతో పాటు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు కీలకంగా వ్యవహరిస్తారు.

పిల్లల వద్దకే పాఠశాల

తనిఖీల్లో భాగంగా సామర్లకోటలో పెద్దపులి చెరువు సమీపంలో విజయ బృందం 21 మంది భిక్షాటన చేస్తున్న బాలలను గుర్తించింది. వారు సంచార జాతికి చెందిన వారు. పీడీ ప్రవీణ, డీసీపీవో వెంకట్ సూచనల మేరకు జిల్లా విద్యా శాఖ వారి గుడారాల వద్దే టెంట్ స్కూల్‌ను ఏర్పాటు చేసింది. కొన్నాళ్ల క్రితం డీఈవో ఈ పాఠశాలను ప్రారంభించారు. పిల్లలకు పాఠాల బోధించేందుకు అక్కడ ఓ బీఈడీ వలంటీర్‌ను నియమించారు.

అడుగడుగునా కష్టాలు

పిల్లల భవిష్యత్తుపై కనీస అవగాహన, బాధ్యత లేని తల్లిదండ్రులను ఎదుర్కొనేందుకు ఈ బృందం పడుతున్న పాట్లు అన్నీ ఇన్నీ కావు. భిక్షాటన మంచిది కాదని చెబుతుంటే.. పలువురు ఎదురుదాడులకు దిగుతున్నారు. కొన్ని సందర్భాల్లో తల్లిదండ్రులు వారి పిల్లలతో బృంద సభ్యులపై ఉసిగొల్పుతున్నారు. ఇంత జరుగుతున్నా ఈ బృందం బాధ్యతాయుతంగా బాలల భవిష్యత్తు కోసం పాటుపడుతున్నారు. చిరు గాయాలతోనే తల్లిదండ్రులను మార్చేందుకు తమ ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు.

కష్టమంతా క్షేత్ర స్థాయి సిబ్బందిదే,,



తాజాగా చేపడుతున్న రెస్క్యూ ఆపరేషన్లలో కీలకంగా వ్యవహరిస్తోంది క్షేత్ర స్థాయి సిబ్బందే. వారి కష్టం సత్ఫలితాలనిస్తోంది. బాలలు, వారి తల్లిదండ్రులతో ఎటువంటి అసాధారణ పరిస్థితులు ఎదురవుతున్నా, ధైర్యంగా పనిచేస్తున్నారు. శాఖల పరస్పర సమన్వయంతో కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది.

\- కొండా ప్రవీణ, పీడీ, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ

రేపటి లోగా అపార్ ఐడీ వివరాల నమోదు

కాకినాడ సిటీ: యూడైస్ ప్లస్‌లో ప్రతి విద్యార్థి అపార్ ఐడీ వివరాలను నిక్షిప్తం చేయాలని కలెక్టర్ షణ్మోహన్ సగిలి గురువారం అధికారులను ఆదేశించారు. అన్ని ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు 16వ తేదీ లోగా అందరు విద్యార్థుల అపార్ ఐడి 100 శాతం నమోదు పూర్తి చేయాలని ఆదేశించారు. లేకుంటే ఆ పాఠశాల, కళాశాలల గుర్తింపు రద్దు చేయనున్నట్లు కలెక్టర్ హెచ్చరించారు. ఒక విద్యార్థి, ఒక దేశం నినాదంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన యూడైస్ ప్లస్ విధానంలో విద్యార్థుల వివరాలను నమోదు చేయాలన్నారు. విద్యార్థులందరికీ తప్పనిసరిగా అపార్ ఐడీ ఉండాలన్నారు. విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇవ్వడానికి ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్తుందన్నారు. ఈ క్రమంలోనే విద్యార్థుల విద్యార్హత, విద్యపై సమగ్ర వివరాలను సేకరిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం సూచించిన వెబ్‌సైట్లోనే వివరాలను నిక్షిప్త చేయాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. జిల్లాలో 3,41,394 మంది విద్యార్థులుండగా 2,35,567 మంది విద్యార్థులకు మాత్రమే అపార్ ఐడీని నమోదు చేశారన్నారు.

మత్స్యవతారంలో సీతారామస్వామి



భక్తులకు మత్స్యవతారంలో దర్శనమిచ్చిన స్వామివారు

బోట్‌క్లబ్: రజిత చిన్న దశావతార అలంకార ఉత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక మెయిన్ రోడ్డులో ఉన్న సీతారామ స్వామి మత్స్యవతారంలో దర్శనమిచ్చారు. స్వామి వారికి ఉదయం అర్చకులు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రతి వ్యక్తి నిత్య విద్యార్థే..

జేఎన్‌టీయూకే ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ

బాలాజీచెరువు: సమాజంలో ప్రతి వ్యక్తి జీవితకాలపు విద్యార్థేనని జేఎన్‌టీయూకే ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ మురళీకృష్ణ అన్నారు. జేఎన్‌టీయూకేలో ఐఎస్‌టీ సంస్థ సహకారంతో గురువారం ఉన్నత విద్యా సంస్థల్లో అధ్యాపకులు బోధనలో ఎలా రాణించాలనే అంశంపై వర్క్‌షాపు నిర్వహించారు. ముఖ్య అతిథి ప్రొఫెసర్ మురళీకృష్ణ మాట్లాడుతూ, గొప్ప అధ్యాపకులు మహా వృక్షం లాంటి వారని, వారు తమ జ్ఞానాన్ని విద్యార్థులకు అందించినప్పుడే ఆత్మ సంతృప్తి కలుగుతుందన్నారు. ఏదైనా ఒక అంశంపై పూర్తి అవగాహన ఉన్నప్పుడే తరగతి గదిలో విద్యార్థులకు సరైన పద్ధతిలో బోధించవచ్చన్నారు. అభ్యసన అనేది నిరంతర ప్రక్రియ అని, మారుతున్న కాలానికి అనుగుణంగా ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ద్వారా ఆధునిక బోధనా పద్ధతులపై అవగాహన పెంచుకోవాలన్నారు. రీసోర్స్‌పర్సన్ ప్రొఫెసర్ ఎన్ఎంకే భట్టా మాట్లాడుతూ, అధ్యాపకులు తమ బోధన సామర్థ్యాలను పెంపొందించుకునేందుకు స్వీయ అంచనా సాధనాలు మెరుగుపర్చుకోవాలని సూచించారు. ఉన్నత విద్యలో మారుతున్న బోధన పద్ధతులకు అనుగుణంగా డిజిటల్ పరివర్తనకు ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీసీ డైరెక్టర్ సుబ్బారావు, ఐఎస్‌డీ డైరెక్టర్ రాములు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీవైఈఓ వెంకటేశ్వరరావు



వేళంగి గ్రంథాలయంలో నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న లైబ్రేరియన్లు, పాఠకులు

కరప: విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు ఏర్పాటుచేసిన గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని వేళంగి ప్రభుత్వ జూనియర్ కళాశాల లైబ్రేరియన్ ఎస్.సుబ్బారెడ్డి అన్నారు. వేళంగి శాఖా గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన జాతీయ గ్రంథాలయాల వారోత్సవాల సందర్భంగా మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రతిఒక్కరూ గ్రంథాలయానికి రావడం అలవర్చుకోవాలన్నారు. వేళంగి గ్రంథాలయం లైబ్రేరియన్ పి.వెంకట రంగయ్య మాట్లాడుతూ, విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు వివిధ పోటీ పరీక్షల పుస్తకాలతో పాటు, అన్ని వర్గాల వారికి ఉపయోగపడే అన్నిరకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కరప శాఖా గ్రంథాలయంలో రికార్డ్ అసిస్టెంట్ ఫణీంద్రకుమార్ ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానాభివృద్ధి

బాలాజీచెరువు: ప్రతిఒక్కరూ పుస్తక పఠనంతో విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని కాకినాడ డీవైఈవో ఎన్.వెంకటేశ్వరరావు అన్నారు. గాంధీనగర్ శాఖ గ్రంథాలయం ఆధ్వర్యంలో కుళాయి చెరువు పార్కు గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభించారు. ప్రతిరోజూ గ్రంథాలయాలను సందర్శించాలని సూచించారు. లైబ్రేరియన్ ములంపాక శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రంథాలయంలో 25 వేల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. రామకృష్ణారావుపేట శాఖ గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో రాజీవ్‌గాంధీ పాఠశాల హెచ్ఎం రాజు పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ



క్రీడా దుస్తులు అందుకుంటున్న విద్యార్థులు

కరప: నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు గురువారం క్రీడా దుస్తులు అందజేశారు. విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు వెలుగుబంట్ల గోపాలకృష్ణ 30 జతలు, గణిత ఉపాధ్యాయుడు టేకుమూడి శ్రీనివాస్ 12 జతలు సమకూర్చారు. . మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, హెచ్ఎం ఎం.శ్రీనివాసరావు, పీఎంసీ చైర్మన్ దేవు దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు

- కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ విక్రాంత్ పాటిల్

కాకినాడ క్రైం: రోడ్డు ప్రమాదాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. కాకినాడలోని జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో ఉన్న పోలీస్ కల్యాణ మండపంలో గురువారం రహదారి భద్రతపై అవగాహన జరిగింది. ఎస్పీ విక్రాంత్ పాటిల్ అధ్యక్షతన వహించారు. ముఖ్యఅతిథిగా కలెక్టర్ షణ్మోహన్ హాజరయ్యారు. రోడ్డు ప్రమాదాలు జరిగిన వేళ తక్షణమే క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించాల్సిన అవసరాన్ని, గోల్డెన్ అవర్ ప్రాధాన్యాన్ని, తక్షణం అందించాల్సిన ప్రాథమిక చికిత్స, సీపీఆర్ చేసే విధానాన్ని అపోలో ఆసుపత్రి వైద్యులు ఆర్థోపెడిక్ సర్జన్ ఛటర్జీ, న్యూరో సర్జన్ రవికిరణ్, ఎమర్జెన్సీ మెడికల్ మేనేజ్‌మెంట్ నిపుణులు అంజలీ, సాయిసుధ ఆసుపత్రి అధినేత డాక్టర్ వాడ్రేవు రవి వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీ మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో చేయాల్సిన కృషి, చేపట్టాల్సిన చర్యలపై పోలీస్ అధికారులు, సిబ్బందికి నిర్దేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ భాస్కరరావు, కాకినాడ డీఎస్పీ రఘువీర్, అపోలో ప్రతినిధి ఐవీ.రమణ, రవాణా శాఖాధికారి సబిత తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్, చిత్రంలో కలెక్టర్ షణ్మోహన్ తదితరులు

ఘనంగా సహకార వారోత్సవాల ప్రారంభం

కరప: మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీఎస్) కార్యాలయాల వద్ద గురువారం 71వ జాతీయ సహకార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. జెడ్.భావారం, కరప, పెనుగుదురు, పెద్దాపురప్పాడు, వేములవాడ, కూరాడ, యండమూరు గ్రామాల్లో పీఏసీఎస్ కార్యాలయాలు ఉన్నాయి. జెడ్.భావారం పీఏసీఎస్ కార్యాలయంవద్ద సీఈఓ రాయుడు వెంకటేశ్వరరావు సిబ్బందితో కలిసి జెండా ఆవిష్కరించి, పీఏసీఎస్ పురోభివృద్ధిని వివరించారు. ఆయా కార్యాలయాల వద్ద సొసైటీ సీఈఓలు రైతులు, సిబ్బందితో కలిసి సహకార జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయా పీఏసీఎస్‌ల సీఈఓలు ఎన్.మూర్తి, పి.పరశురాముడు, ఎస్.రామ్మోహన్‌నాయుడు, పి.నాగేశ్వరరావు మాట్లాడుతూ, మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి రోజున జాతీయ సహకార వారోత్సవాలు ప్రారంభించి, వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తారన్నారు. సంఘ పరిధిలో రైతులకు అందజేస్తున్న దీర్ఘ, స్వల్పకాలిక రుణాలు, సంఘ కార్యకలాపాలను వారు వివరించారు.



కేసీబీఎస్‌లో సహకార జెండాను ఆవిష్కరిస్తున్న కార్యదర్శి గోవింద్

కేసీబీఎస్‌లో సహకార వారోత్సవాలు

బోట్‌క్లబ్: ది కాకినాడ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ(కేసీబీఎస్)లో గురువారం సహకార వారోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. సొసైటీ కార్యదర్శి ముమ్మిడి గోవిందు, డైరెక్టర్లు సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. తొలుత మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి కార్యదర్శి, డైరెక్టర్లు, ఉద్యోగులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేనేజర్ చీమల కొండ గంగాధరం సహకార వ్యవస్థ ప్రయోజనాలను వివరించారు. సొసైటీ కార్యదర్శి ముమ్మిడి గోవిందు మాట్లాడుతూ, సహకార రంగంలో కొనసాగుతున్న తమ ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తున్నట్టు చెప్పారు. సహకార వ్యవస్థ మరింత బలోపేతం చేసేలా సొసైటీని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. సమావేశంలో సొసైటీ డైరెక్టర్లు ముత్తా మధు, ముమ్మిడి వెంకటరమణ, కోసూరి లక్ష్మీప్రసాద లావణ్య, ఓబిలిశెట్టి బుచ్చిరాజు, శివ, బాలయోగి తదితరులు పాల్గొన్నారు.



జెడ్.భావారం పీఏసీఎస్ వద్ద నిర్వహించిన సహకార జెండా ఆవిష్కరణ

సుస్థిరాభివృద్ధే ధ్యేయంగా జీపీడీపీ ప్రణాళిక

కరప: ప్రతి గ్రామం 2030 నాటికి సుస్థిరాభివృద్ధి సాధించేలా పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక(జీపీడీపీ) రూపొందించాలని ఎంపీడీఓ ఎం.అనుపమ అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో గురువారం పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, యానిమేటర్ల(వీఓఏలు)తో ఏర్పాటు చేసిన జీపీడీపీ 2025-26 శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పంచాయతీ స్థాయిలో ప్రజల భాగస్వామ్యం వహించేలా బాల సభ, మహిళాసభ, గ్రామసభలు నిర్వహించి, అన్ని శాఖల సమన్వయంతో ప్రజల అవసరాలను గుర్తించాలన్నారు. అక్కడి పరిస్థితులకు అనుగుణంగా విశ్లేషణ చేసి, పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారు చేయాలన్నారు. పంచాయతీ అభివృద్ధి ఇండెక్స్ స్కోర్‌ను అనుసరించి థీమాటిక్ అప్రోచ్‌లో భాగంగా ఒక థీమ్‌ను ఎంపిక చేసుకోవాలన్నారు. ఆ లక్ష్యాలు సాధించడానికి అవసరమైన వనరులను సమీకరించి, నిధుల కేటాయింపు, మ్యాపింగ్ చేసి గ్రామ సభ, పంచాయతీ ఆమోదంతో కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. తదుపరి దశలో నిధుల విడుదల నిరాటంకంగా జరుగుతుందని వివరించారు. జీపీడీపీ తయారీలో అనుసరించాల్సిన విధి విధానాలపై ఈఓ పీఆర్ఆర్‌డీ ఎస్‌వీ శ్రీనివాసరావు, పెనుగుదురు కార్యదర్శి బి.చంద్రకళ శిక్షణ ఇచ్చారు. డీఎల్‌పీఓ అన్నామణి, మండల ఇంజినీరింగ్ అధికారి జి.శైలజ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ వీఎస్ వర్ధన్, మండల పశు వైద్యాధికారి ఎం.రవికిరణ్, ఏపీఓ జీవీ రమణకుమార్, డీఐసీఓ స్వామి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ అనుపమ

రైతుల నుంచి 350 దరఖాస్తులు

కరప: వేములవాడలో గురువారం రీసర్వే గ్రామసభ జరిగింది. రైతులు రెవెన్యూ అధికారులతో వాగ్వాదానికి దిగారు. గతంలో చేసిన రీసర్వే మాదిరిగానే మళ్లీ రీసర్వే జరుపుతారా అని రైతులు ప్రశ్నించారు. రీసర్వేలు చేయక్కరలేదని, పాత రికార్డుల ప్రకారం తమ భూములను అప్పగించాలని రైతులు పట్టుబట్టారు. తహసీల్దార్ ఎన్.సత్యనారాయణ మాట్లాడుతూ, గతంలో రీసర్వేలో జరిగిన పొరపాట్లు సరిదిద్దేందుకే గ్రామసభలు నిర్వహిస్తున్నామన్నారు. రైతులు తమ సమస్యలపై దరఖాస్తులు ఇస్తే, రైతుల సమక్షంలో రీసర్వే చేసి పరిష్కరిస్తామని మండల సర్వేయర్ ఎస్.రూపవతి వివరించారు. గ్రామసభలో 350 అర్జీలు అందాయి. రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ డి.దుర్గాప్రసాద్, ఆర్ఐ పవన్, దేవదాయ శాఖ ఈఓలు కె.తిరుమల రవితేజ, మోర్త మురళీవీరభద్రరావు, వీఆర్వో వి.రాజు తదితరులు పాల్గొన్నారు.



వేములవాడ గ్రామసభలో అర్జీలు ఇస్తున్న రైతులు

పార్కు గేట్ల పరిశీలన

కాకినాడ క్రైం: కాకినాడ కుళాయి చెరువు వివేకానంద పార్కుకు చెందిన రెండు ప్రధాన గేట్లు తెరవాలని సామాజిక వేత్త, పౌర సంఘం కన్వీనర్ ధూసర్లపూడి రమణరాజు సీఎంకు లేఖ రాశారు. ముఖ్యమంత్రి కార్యాలయం ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ డీఈ లక్ష్మీనారాయణ మూసి ఉన్న గేట్లను గురువారం పరిశీలించారు. అర్జీదారు రమణరాజు సహా, అక్కడి ప్రజలను అడిగి సమస్య తెలుసుకున్నారు. డీఈ తక్షణమే ట్రాఫిక్ పోలీస్ విభాగం నివేదిక అనుసరించి తుది నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

కొత్త కమిటీ వేయాలి

కాకినాడ సిటీ: జగన్నాథపురంలో ఉన్న పురాతన సెంటినరీ ఆంధ్ర బాప్టిస్టు చర్చికి అందరికీ ఆమోదయోగ్యమైన కమిటీని ఏర్పాటు చేయాలని కోరుతూ చర్చి సంఘ సభ్యులు స్థానిక జిల్లా మైనార్టీ వెల్ఫేర్ కార్యాలయం వద్ద గురువారం ఆందోళన చేపట్టారు. మైనార్టీ వెల్ఫేర్ అధికారులు ఏర్పాటు చేసిన కమిటీని రద్దు చేసి, కొత్తది వేయాలని కోరారు.

ఉత్సాహంగా బాలల దినోత్సవం



నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఐసీడీఎస్ పీడీ ప్రవీణ



చిన్నారులకు బహుమతులు అందిస్తున్న ఆనందరాయుడు



నడకుదురు పాఠశాలలో నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

కాకినాడ సిటీ: మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని బాలల దినోత్సవ కార్యక్రమాలు వివిధ ప్రాంతాల్లో ఉత్సాహభరితంగా కొనసాగాయి. కాకినాడ రూరల్ మండలం తూరంగి అల్లూరి సీతారామరాజు కాలనీ, ఈశ్వర్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ పీడీ పి.ప్రవీణ పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జరుగుతున్న తల్లీబిడ్డ క్షేమం, శిశు మరణాల నివారణ, బాల్య వివాహాలను నిరోధం, పిల్లలను స్కూళ్లకు పంపడం తదితర కార్యక్రమాలను తల్లిదండ్రులు ఉపయోగించుకోవాలని కోరారు. సీడీపీవో వై లక్ష్మి మాట్లాడుతూ, బాల్య వివాహాలు జరగకుండా అందరూ ప్రతిజ్ఞ చేయాలన్నారు. పిల్లలకు క్విజ్, కేరమ్స్, కుర్చీలాట, గాలిపటాలు తదితర పోటీలు నిర్వహించారు. తొలుత నెహ్రూ చిత్రపటానికి పీడీ ప్రవీణ జేఎన్‌టీయూకే ప్రొఫెసర్లు ఆలపాటి శ్రీనివాస్, దొరస్వామి నాయక్, సీడీపీవో లక్ష్మి నివాళులర్పించారు.

అన్ని రంగాల్లో రాణించాలి

బోట్‌క్లబ్: చిన్నారులు అన్ని రంగాల్లోను రాణించాలని పీఎస్ఎన్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్ చైర్మన్ పి.ఆనందరాయుడు అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ కాకినాడ సన్‌రైజ్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పోటీల్లో విజేతలైన చిన్నారులకు ఆయన బహుమతులు అందించారు. క్లబ్ లెర్నింగ్ ఫెలిసిటేటర్ ఏవీ రంగారావు మాట్లాడుతూ, చిన్నారులు ఇప్పటి నుంచి లక్ష్యాలను చేరుకునేందుకు కృషి చేయాలన్నారు. క్లబ్ అధ్యక్షుడు శ్రీకృష్ణవర్మ, సెక్రటరీ సాయి సుందర్, యూత్ సర్వీస్ డైరక్టర్ సంతోష్, పాల్గొన్నారు.

నడకుదురు పాఠశాలలో..

కరప: మండలంలోని నడకుదురులో ఉన్న మండల ప్రాథమిక పాఠశాలలో బాలల దినోత్సవం నిర్వహించారు. హెచ్ఎం వాకాడ వెంకటరమణ, ఉపాధ్యాయులు కేవీ లక్ష్మి, ఎస్ఎంసీ చైర్మన్ నూకరత్నం, వైస్ చైర్మన్ కరుణతో కలిసి నెహ్రూ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. యంగ్‌మైండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ సమకూర్చిన పరీక్ష ప్యాడ్లను విద్యార్థులకు అందజేశారు.

కోరమండల్ మహిళా సంఘం ఆధ్వర్యంలో..

కాకినాడ రూరల్: వాకలపూడి అంగన్‌వాడీ కేంద్రంలో కోరమండల్ మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సంఘ కార్యదర్శి మల్లీశ్వరి మాట్లాడుతూ, బాలల అవసరాలను తీర్చాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనన్నారు. తొలుత కేంద్రం బాలలు కేక్ కట్ చేశారు. అనంతరం వారికి బహుమతులు పంచిపెట్టారు.